# బ్రతుకుబాట

– తనికెళ్ళ కల్యాణి

ఎదురుగా కన్పిస్తున్న దృశ్యాన్ని మాధవి రెప్పవేయకుండా చూస్తోంది. తుమ్మెద ఒకటి తేనె కోసం పూలచుట్టూ తిరుగుతోంది. నెమ్మదిగా ఒక పువ్వుని ఎలాగైతేనేం స్వంతం చేసుకొంది. మెడ త్రిప్పి మాధవి ముందు వసారాలోకి చూసింది. తండ్రి వసారాలో, పడక కుర్చీలో కూర్చుని భాగవతం చదువుకొంటున్నారు. తల్లి ఆయనకి దగ్గరలో కూర్చుని ఇంటి విషయాలేవో చెపుతోంది.

''అయితే మాధవిని రేపు విజయవాడ రఘు దగ్గరికి పంపిద్దామా?'' మాధవి తల్లి కామేశ్వరి అడిగింది. ఆయన మళ్ళీ పుస్తకంలోనుండి ఆవిడవైపు చూశారు. ఆయనకి మరొకసారి విషయం చెప్పక తప్పదనుకొందావిడ. విషయం అంతా పూసగ్రుచ్చినట్టు చెప్పకపోతే మళ్ళీ ఆయన మొదటికి వస్తారు. అందుకే, ''మన మధూని విజయవాడ పంపకపోతే ఎలాగ? వనజకి టైఫాయిడ్ అని రఘు వ్రాశాడు కదా! పిల్లలతో, ఉద్యోగంతో వాడేం చెయ్యి కాల్చుకొంటాడు? మధు వెళ్ళి ఒక నెల ఉండి, వాళ్ళకి సాయంచేసి వస్తుంది'' అంటూ ఆవిడ అంతా చెప్పేసింది.

మాధవి బరువుగా నిట్టూర్చింది. తల్లి ఒక నిర్ణయానికి వచ్చిందంటే అది జరిగితీరుతుంది. తన ప్రయాణం రేపు ఖాయం. కొన్నాళ్ళు విజయవాడలో అన్నా, వదినల దగ్గర సాయం చేస్తూ బ్రతకాలి. ఈలోపు అక్కగారికి ఏ అవసరం వచ్చినా ఆమె దగ్గరకి పరుగెత్తాలి. మరదలికి ఏ వేవిళ్ళో వస్తే అటు నీరసంతో ఆవిడ చేసుకోలేదు కనుక తను వెళ్ళాలి. తమ్ముడు మద్రాస్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మరదలు మొదటిసారి నెల తప్పినపుడు తల్లి తననే కదా సాయానికి పంపింది.




ఈ అమలాపురం వదిలి ఎక్కడికీ వెళ్ళాలని తనకి అన్పించదు. తన చదువు, పెళ్ళి అన్నీ ఇక్కడే కదా. ఈ పచ్చటి ప్రకృతిని, ఈ కొబ్బరి తోటలని వదిలి ఎలా వెళ్ళగలదు? ఒకవేళ శరీరం వెళ్ళినా మనసు ఇక్కడే తిరుగుతూ ఉంటుంది.

''ఆంటీ! ఆంటీ! నాకు జడ వేయరూ? ప్రక్క ఇంటి సుధ వచ్చి ముద్దుగా అడగటంతో మాధవి చేతిలోని బిందె ప్రక్కన పెట్టింది. కొబ్బరినూనె, దువ్వెన తీసికొనివచ్చి పాపదగ్గర కూర్చుంది.

మాధవి చేతిలోని కొబ్బరినూనె చూశాక సుధకి తన పొరపాటు తెలిసింది. ''అయ్యో! సెంటునూనె తేవడం మరచిపోయానాంటీ! రాధక్కయినా గుర్తుచేయదు. ఎప్పుడూ నవలలు చదువుకోవడమే పని దానికి.'' సుధ సగం ఫిర్యాదుగా, సగం సంజాయిషీగా అంది.

సుధ మాటలకి మాధవి నవ్వేసింది. నవ్వుతున్న మాధవిని సుధ మైమరిచి చూసింది. ''ఆంటీ! మీరు నవ్వుతూంటే ఎంత బావుంటారో? ఎప్పుడూ నవ్వుతూ ఉండండి ఆంటీ!''

''మధూ! నాన్నగార్కి ఆకలి వేస్తోందిట. నాలుగు పకోడీలు వేసి పెట్టరాదే. నా నడుం ఒక్కలాగ లాగేస్తోంది.'' కామేశ్వరమ్మ లోపలికి వస్తూనే అందుకొంది. మాధవి ఏం మాట్లాడలేదు.

''మాట్లాడవేమే! ఇంకా ఆలస్యం చేస్తే టిఫిన్ ఎప్పుడు తింటారు? భోజనం ఎప్పుడు చేస్తారు?'' కొంచెం చిరాకుగా అంది కామేశ్వరమ్మ.

''ఇదిగో! సుధ జడలు అయ్యాక చేస్తానమ్మా!'' మాధవి మంద స్వరంతో జవాబిచ్చింది.

''సుధా! మీ రాధ ఏం చేస్తోంది? నీకు జడలు తను వేసిందనుకో, తనకీ పని వస్తుంది కదా!'' ఎప్పటిలాగే ఆవిడ అంటూంటే సుధ బిక్కమొహం పెట్టింది.

మాధవికి తల్లి మీద కోపం వచ్చింది. రాధ సుధకన్నా నాలుగేళ్ళు పెద్ద. అంతే. ఆ పిల్లకి మాత్రం ఏం పని వచ్చేస్తుంది? తన తల్లికి భయపడి రెండు పూటలూ రాదు. ఒకపూట వచ్చి వేయించుకొంటుంది. ఒకపూట పైపైన దువ్వేసుకొంటుంది. ఎదుగుతున్న పిల్లలు. తల్లి విసుక్కోవడం చూస్తే గ్రహించరూ? మాధవిని ఊరిస్తూ తన కొత్త టీచర్ కబుర్లు ఎన్నో చెప్పాలని సుధ అనుకొంది. కామేశ్వరమ్మ వచ్చి అక్కడున్న బల్ల దగ్గర కూర్చోవడంతో ఆపిల్లకి మరి మాటలు రాలేదు.

మాధవి సుధ జడ పూర్తిచేసి, టిఫిన్ చేయడంలో



## సాగేగుణం

''అంజలీ సాగే గుణం వేటికి ఉంది?'' అడిగింది కెమిస్ట్రీ టీచర్.

''టీవీ మెగా సీరియల్‌కి టీచర్'' ఠక్కున చెప్పి కూర్చుంది అంజలి.

\- మదన్

## విరాళం

''మన ఊరి పెద్దలంతా కలిసి ఊళ్ళో అనాథాశ్రమం కట్టబోతున్నారు కదా. విరాళంగా నువ్వేమిచ్చావు?'' అడిగాడు పరంధామయ్య.

''నాకు కలిగిన అరడజను పిల్లలని...'' చెప్పాడు ఆచారి.

## హంతకుడు

''ఏం నేరం చేసి దొరికిపోయావు?'' అడిగాడో ఖైది.


''నాలుగో అంతస్థులో ఒకడిని హత్యచేసి వాడినక్కడే పాతిపెట్టడానికి ట్రై చేసాను!'' చెప్పాడు మరో ఖైది.

## పిచ్చి తెలివి

''నీవు చదువురానివాడివి కదా. మరి.. నేనడిగే అన్ని ప్రశ్నలు ఎంతో తెలివిగా ఎలా జవాబివ్వగలుగుతున్నావు?'' ఆశ్చర్యంగా అడిగాడు లాయర్.

''పిచ్చి పిచ్చి ప్రశ్నలకి జవాబిచ్చేందుకు చదువే కావాలా సార్?'' అన్నాడు సాక్షి వెంటనే.

\- పి.వి. మురళీకృష్ణ (హైద్రాబాద్)




మునిగింది. వేడి వేడి పకోడీలు ప్లేటులో పెట్టి అందిస్తున్న కూతురిని చూసి నిట్టూర్చాడు రామారావు. ''అమ్మని చేయమనక పోయావామ్మా'' అన్నారు.

సాయంత్రం వంటలోకి దొండకాయలు తరుగుతోంటే లక్ష్మమ్మగారు వచ్చి మాధవి దగ్గర కూర్చున్నారు. ''మధూ! పని త్వరగా అయితే రామాలయానికి వెళ్దామా'' అన్నారు.

మాధవి తల ఎత్తి ''ఇంకా పెసరపప్పు పచ్చడి చేయాలి మామ్మా. ప్రొద్దుటి పులుసు అయిపోయింది. చారు పెట్టాలి. లేకపోతే మధు ఊరుకోడు'' అంది.

మధుసూదనం అక్క కొడుకు. ఇక్కడుండి చదువుతున్నాడు. వాడన్నా, వాడి పేచీలన్నా ఇంట్లో అందరికీ భయం.

''బావుందే! నువ్వుమాత్రం ఎక్కడికి వెళుతున్నావని? మరీ ఇంట్లో ఉంటే పిచ్చెక్కుతుంది. మీ అమ్మ పెడుతుందిలే చారు.'' అంటూ మనవరాలిని వెనకేసుకొని వస్తూ ''అయినా మీ అమ్మకి నువ్వు పనులు అందుకొంటున్నావని ఏదో ఒక అనారోగ్యం వస్తూనే వుంది. మునుపే నయం. గిలకలాగ అన్ని పనులూ తిరిగి చేసుకొనేది.'' ఆవిడకి కోడలిమీద కోపం, చిరాకు. అందుకే ధాటీగా అంది.

''నా బిడ్డ నాకు సాయం చేస్తోంటే మీకెందుకు మధ్య బాధ? ముసలివారైనా ఇంకా అత్తగారి సాధింపు మానలేదు. నా ఖర్మ. ఇంకా మనవలు పుట్టినా మాటలు పడటం తప్పలేదు నాకు. నా రాత ఇంతే'' అంటూ కామేశ్వరమ్మ తగాదాకి వచ్చింది.

నేనేమైనా తగ్గుతానా అన్నట్లు లక్ష్మమ్మగారూ ఊరుకోలేదు. ''ఉన్నమాటంటే ఉలుకేనే. బిడ్డ నెత్తిన పనంతా పెట్టి నువ్వు పెత్తనం చెలాయించడం లేదూ? దాని వయసెంత? అది మోస్తున్న బరువెంత? నా బిడ్డ.. నాబిడ్డ అంటూ గెంతడమే కానీ దాన్ని ఏం సుఖపెడుతున్నావు?'' ఆవిడ కోడలిని నిలేసింది.

''నేను నాలుగు రోజులు కూర్చుంటే మీకు కళ్ళు కుడతాయి. చివరికి నాబిడ్డకి నామీద మనసు విరిగేటట్లు చేస్తున్నారు.'' అంటూ ఆవిడ అరుస్తోంటే, మాధవి చిరాకుగా చూసింది.

బయటకి షికారు వెళుతున్న రామారావుగారు భార్యని గట్టిగా కేకవేసి పిలవడంతో, ఆవిడకి వెళ్ళక తప్పలేదు. రోట్లో పెసరపప్పు వేసుకొని రుబ్బుతున్న మాధవిని చూస్తూ, ''మధూ, మరికాస్త పప్పు వేయమ్మా! కాస్త పచ్చడి, నాలుగువేపుడు ముక్కలు చక్రపాణి గారింట్లో ఇయ్యమ్మా'' అందావిడ.

''మామ్మా! మరి.. అమ్మ..'' అంటూ అర్థోక్తిలో ఆపేసింది మాధవి. ఆవిడ బరువుగా నిట్టూర్చింది. ఎన్నో కష్టసుఖాలని చూసిన అనుభవం ఆ వృద్ధురాలి నుదిటి ముడతలలో కన్పిస్తోంది. ''చూడు మధూ! మనకి తోచిన సాయం ఎప్పుడూ ప్రక్కవారికి చేయాలి. భ... మనకి పొలం, పుట్రా ఇచ్చాడు. మనకి ఉన్నదే అ... మైనపుడు ఎదుటివాళ్ళకి సాయం చేయాలి. ... చిన్నవయసులో ఆయనకి రాకూడని కష్టం వచ్చి... ఏవో మనకళ్ళ ముందు బాధపడుతూంటే ఎలా చూ... గలం?'' ఆవిడకి ఎప్పుడూ ఇతరుల కష్టాల... చేయూత ఇవ్వాలనే ఉంటుంది. కొడుకు తల్లి పను... ఏనాడూ అడ్డుచెప్పడు. కోడలు గొణుక్కొన్నా ఆ... పట్టించుకోదు. ''ఈ ఆస్తిని నా భర్త ఇచ్చాడు. నేనున్న... తకాలం ఈ దానధర్మాలు తప్పవు'' అంటుందావిడ.

మాధవి ఇంట్లో పనిపూర్తి చేసుకొన్నాక, పచ్చడి, కూ... తీసుకొని చక్రపాణిగారి ఇంటివైపు నడిచింది. ఆయన డైరీలో ఏదో వ్రాసికొంటున్నారు. ఆయన కళ్ళు నీటి చెలమల్లా ఉన్నాయి. మాధవికి ముందుకి అడుగేయాలో, వెనక్కి వెళ్ళిపోవాలో తెలియలేదు. ''ఆంటీ! లోపలికి రండి!'' పదవ తరగతి చదువుతున్న రవిబాబు పిలవడంతో ఊపిరి తీసుకొని, నెమ్మదిగా నడుస్తూ లోపలికి వెళ్ళింది.

ఆంటీ! కాసేపు కూర్చోండి. సుధ ఆమె చెయ్యి వదలకుండా మారాం చేస్తూంటే మాధవి మొహమాటంగా నిలబడిపోయింది. ''ఇంట్లో పనుందమ్మా'' అంటున్నా వినకుండా, ఆమెను బలవంతంగా కూర్చోపెట్టి, మెడ చుట్టూ చేతులు వేస్తూ ''మాకు క్రొత్త టీచర్ వచ్చారు. ఎన్నో పాటలు పాడతారు. అప్పుడే నాకొకటి వచ్చేసింది'' ఊగుతూ ఒక్కొక్కటి చెప్పసాగింది.

రాధ చెల్లెలిని చిరాకుగా చూసింది. ''ఆంటీ ఒళ్ళో ఎక్కితొక్కకూడదని చెప్పలేదా?''

''నా ఆంటీ, నా ఇష్టం. నీకెందుకు మధ్య?'' సుధ ఊగుతూనే అక్కమాట లెక్కలేనట్లు అనేసింది.

రాధ అంతకంటే కోపంగా ''నీకసలు బుద్ధి ఉంటే కదా!'' అంది. ''అబ్బబ్బ, మీకసలు ఏమీ తెలియదు. నాన్నగారు బాధపడుతోంటే మీరు అల్లరి చేయవచ్చునా?'' రవిబాబు చెల్లెళ్ళని మందలిస్తున్నట్లు సన్నగా అన్నాడు.

మాధవి మనసు ఆ పిల్లలపట్ల జాలితో నిండిపోయింది. ''రవిబాబూ, అన్నం వండటం అయిందా?'' అని అడిగింది.

''అయ్యో ఆంటీ, మరిచేపోయానూ.'' అంటూ అతడు లేచాడు. ''అన్నయ్యా, నేను బియ్యం కడుగుతా!'' అంటూ రాధ వెనక వెళ్ళింది. మాధవి సుధ చేతిని పట్టుకొని వంటింటివైపు నడిచింది.

వాళ్ళని వద్దని తనే బియ్యం కడిగి, కుక్కర్ ఎక్కించింది. ఆమె ఆ పనులు చేస్తోంటే పిల్లలు వెనుక వెనుకే తిరగసాగారు. ఇంక మాధవి ఉండలేనట్లు అడిగేసింది, ''రవిబాబూ, మరి నాన్నగారు మీతోపాటు భోజనం చేయడంలేదా?'' ఉదయం అన్నం మిగిలిపోవడం ఆమె దృష్టిని నిలదీసింది.

నాన్నగారు మాతో తినరు. తర్వాత తింటానంటారు. తర్వాత ఒకొక్కసారి ఏడుస్తూ తినడంలేదు. సుధ ఆరిందాలాగ చేతులు త్రిప్పుతూ చెప్పేసింది.

''మొన్న గోవిందరావు తాతగారు, మామ్మగారు వచ్చి నాన్నగారిని తిట్టారు. మీరు ఇలాగ ఏడుస్తూ కూర్చుంటే పిల్లల్ని ఎవరు చూస్తారని కేకలేశారు.'' రాధ అరమ... కలు లేనట్లు చెప్పేసింది.

మాధవికి వచ్చేస్తుంటే చక్రపాణిగారివైపు చూడాలని అన్పించినా, గబగబ ఇంటికి వచ్చేసింది.

రాత్రి పడుకొనే ముందు తల్లితో అమ్మా, నేను రాత్రి విజయవాడ వెళ్ళనమ్మా అంది. ఆవిడ నిర్ఘాంతపోయింది. ''మాధవి తడబడుతు అది కాదమ్మా, నాకు అక్కడ ఏమీ తోచదు. మీ దగ్గర ఉన్నట్లు ఉండదు. నేను వెళ్ళలేనమ్మా'' అంది.

కామేశ్వరమ్మకి మాధవి ధోరణి విసుగ్గా, క్రొత్తగా అన్పించింది. ''చూడు మధూ! మా తర్వాత నువ్వు అన్న దగ్గర, తమ్ముడి దగ్గర ఉండవద్దా! నిన్ను చూసుకోవలసిన వాళ్ళు వాళ్ళు కదా! వాళ్ళ కష్టసుఖాలు నువ్వు పట్టించుకోకపోతే ఎలాగ? ఎల్లకాలం మేం ఉంటామా? కాస్త పరిస్థితులర్థం చేసుకోవడం నేర్చుకో.''

తల్లి మాటలు ఆమెకి ఎంతో బాధ కలిగించాయి. మంచం క్రింద పెట్టిన మంచినీళ్ళ చెంబు అందుకొంటున్న లక్ష్మమ్మగారు మనవరాలివైపు చూశారు. తన మనసుని అర్థం చేసుకొమ్మనట్లు చూస్తున్న మాధవి చూపులు ఆవిడ మనసుని కరిగించాయి. కోడలి మీద కోపం కూడా వచ్చింది. ఏం మనిషి? కాస్తయినా బిడ్డ మనసునర్థం చేసుకోదు.

ఆవిడ మంచినీళ్ళు త్రాగి, తగ్గిన స్వరంతో అన్నారు, ''చూడు కామేశ్వరీ! ఎవరి కష్టసుఖాలు వాళ్ళు పడాలి. ఈరోజు మధు ఉన్నది కనుక అటూ, ఇటూ అన్నింటికీ పంపుతున్నావు. మధు లేకపోతే వాళ్ళు ఇబ్బందులు వాళ్ళు పడతారా? లేదా? ఏ పరిస్థితులలనైనా ఎదుర్కోవడం మనం పిల్లలకి నేర్పాలి. దానికి చిరాకుగా ఉన్నప్పుడు ఎందుకు పంపడం?''

కామేశ్వరమ్మకి అత్తగారు కల్పించుకోవడం చిరాకు తెప్పించింది. 'అసలు ఆవిడ వత్తాసు చూసుకొనే మధు పెంకిదవుతోంది' అనుకొంది. పైకి మాత్రం ''మధు మంచికోరే, వాళ్ళతో అనుబంధం పెంచుకొంటుందని పంపిస్తున్నాను. వాళ్ళ అండ లేనిదే దాని బ్రతుకు ఎలాగ తెల్లవారుతుంది?'' అంటూ వెళ్ళిపోయింది.

ప్చ్.. తెల్లవారడమా? తన బ్రతుకు చీకటులు ఏనాటికీ తనని వదలవు. ఇలాగ బ్రతకడమే ననుకొంది మాధవి. మనవరాలి నిర్లిప్తత చూస్తోంటే లక్ష్మమ్మగారికీ బాధగానే ఉంది. నిద్రపట్టక మంచం మీద అటూ, ఇటూ దొర్లుతున్న మాధవిని చూస్తే కడుపు తరుక్కుపోయింది. భర్త కౌగిలిలో హాయిగా నిద్రపోవలసిన ఈపిల్ల బ్రతుకు ఇలాగ అయిందేమిటని ఆవిడ మూగగా రోదించారు. ఈపిల్ల బ్రతుకులో వెన్నెల రాదా? ఏ సుఖమూ నోచుకోకుండా బ్రతుకుని ఈడ్చడం ఎంత బాధాకరం?

''ఆంటీ.. ఈరోజు మీరు ఊరు వెళుతున్నారు కదూ. అందుకే ఉదయమే వచ్చేశాను'' సుధ మాధవి చెయ్యి పట్టుకొని ఊపుతూ అంది.

మాధవి ఏం మాట్లాడలేకపోయింది. సుధని తీసుకెళ్ళి జడలు వేసింది. పెరట్లోని కనకాంబరాలు మాలకట్టి ఆపిల్ల తలలో తురిమింది. రాధకివ్వమని గులాబీలు ఇచ్చింది. ఆంటీ! ఊరు మానెయ్యకూడదా?'' సుధ అమాయకంగా అంది.

''త్వరగా వచ్చేస్తాను కదా!'' పైకి సుధని బుజ్జగించాలని అన్నా, మనసులో నాఇష్టం ఏం ఉంది. వాళ్ళు పంపినపుడు రావాలి అని అనుకొంది.

ప్రయాణంలోనూ ఆమెలో ఆకుటుంబానికి సంబంధించిన ఆలోచనలే. చక్రపాణిగారికి సావిత్రి అంటే ఎంత మమకారమో ఆమెకి తెలుసును. భార్య సావిత్రి తోటిదే లోకమని ఆయన బ్రతికారు. మామ్మ అన్నట్లు సావిత్రిగారు అదృష్టవంతురాలే. ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు, కళ్ళల్లో పెట్టుకొని చూసుకొన్న భర్త. ఐదవతనంతో హాయిగా ఆవిడ వెళ్ళిపోయింది. అతిసార వ్యాధి అలాగ ఆమెని పొట్టున పెట్టుకుంటుందని ఎవరు ఊహించారు?

స్టేషన్‌కి వచ్చిన రఘు చెల్లెలిని చూసి నవ్వి, లగేజి అందుకొన్నాడు. ''మధూ! నువ్వు మొన్నే వస్తావనుకొన్నానే'' అన్నాడు. ఇంటిదగ్గర వనజా అదేమాట. ''ఈపిల్లలతో, నా అనారోగ్యంతో ఆయన ఎంత అవస్థ పడుతున్నారో? వచ్చేదానివి కాస్త ముందుగా వస్తే ఆయనకి శ్రమ ఉండదుకదా!''

మాధవి దేనికీ జవాబు చెప్పలేదు.

వంటిల్లు, పిల్లలగది మరీ భయంకరంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా మాసిన బట్టలు, సామాన్లు. ఆఇల్లు చూస్తే మాధవికి నీరసం వచ్చింది. పైటకొంగు బిగించి, ఒక్కనిట్టూర్పు విడిచి పనిలో చొరపడింది. ఏమనుకొన్నాడో ఏమిటో రఘు హోటల్‌కి వెళ్ళి అందరికీ ఆపూట టిఫిన్లు తెచ్చేశాడు.

''నేను ఒంటిగంటకి వచ్చి భోజనం చేస్తా! నువ్వు నెమ్మదిగా తెములు'' అంటూ చెల్లెలితో చెప్పి బయటికి నడిచాడు.


హార్లిక్స్ గ్లాసు వదినగారికి ఇవ్వడానికి వెళ్ళిన మాధవితో ''ఆయన అంతే! ఒకటే దుబారా! కాస్త ఉప్మా ఎంత సేపట్లో చేస్తావు చెప్పు'' అంది. ఆడపడుచు ప్రయాణంచేసి రాగానే ఇంటిపని అప్పచెప్పడం ఏం భావ్యం అని ఆమె కనుకోదు. మాధవి జవాబు చెప్పకుండా ఇవతలికి వచ్చింది.

అసలు మాధవి ఎవరికీ సమాధానం చెప్పదు కనుకనే ఎక్కడికి వెళ్ళినా తగాదాలుండవు. ఒక చేత్తో తప్పట్లు మ్రోగవు కదా! ఎవరు ఏమన్నా సమాధానం చెప్పదు. అప్పుడప్పుడూ వనజ 'ఊరుకొన్నవారితో ఊరంతా కలిసినా చాలలేరు' అని చులకనగా అన్నా పట్టించుకోదు.

ఆరాత్రి పిల్లల గదిలో పడుకొన్న చెల్లెలిని చూసి రఘు నిట్టూర్చాడు. 'మధు రోజురోజుకీ స్తబ్దుగా తయారవుతోంది' అనుకొన్నాడు. చైతన్యంతో గలగలా కబుర్లు చెపుతూ తిరిగే ఆ మధూ, ఈమె ఒకరంటే నమ్ముతారా ఎవరైనా అనుకొన్నాడు. నాన్నగారి సంతానంలో తామంతా బాగున్నారు. మధు జీవితమే ఇలాగైంది.

వనజకి అనారోగ్యం తగ్గి, ఓపిక వచ్చాక మాధవి అన్నగారి దగ్గరికి వచ్చి అడిగింది తనని ఇంక ఊరు పంపె

## 22 వృత్తుల వ్యక్తి




వాషింగ్‌టన్‌కు చెందిన పి. జి. డేఫీ అనే వ్యక్తి ఇతని జీవితకాలంలో 22 విభిన్న వృత్తులలో పనిచేసి జీవించాడు. ఫోటోగ్రాఫర్, ఎడిటర్, ప్రైవేట్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ చీఫ్, మర్చంట్ మెరైనర్, షైటర్, మైనర్, ఫార్మర్, లాగర్, ఫామ్‌హౌస్ ఓనర్, కార్పెంటర్, ప్లంబర్, సోల్జర్, గైడ్, హోటల్ కీపర్, బార్ అటెండర్, డ్రైవర్, ఇన్‌స్పెక్టర్, బాడీ గార్డ్, బ్లాక్స్మిత్, సిమెంట్ వర్క్స్ వర్కర్, రచయిత మొదలగు 22 విభిన్న వృత్తులు ఈయన తన జీవితకాలంలో నిర్వహించాడు. ఇన్ని వృత్తులు నిర్వహించగలిగినవారు బహుశా ఇంకెవరూ వుండరేమో!

## అనాథలైన అమెరికన్ పిల్లలు

కుటుంబ పోషణ కోసం భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయవలసిన అవసరం రావటంతో ఉద్యోగాలకు వెళ్లేటప్పుడు తమ పిల్లలను బేబీకేర్ సెంటర్‌లో వుంచడం వలన ఆ పిల్లలు అనాథల్లా తల్లి లాలన, తండ్రి పాలనకు దూరమై గడపవలసి వస్తుంది. అమెరికన్ పిల్లల్లో తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు, వాత్సల్యానురాగాలు కరువై ఇలా జీవిస్తున్నారు ఆ పిల్లలు. ఇటీవల జరిగిన ఒక సర్వేలో అయిదు మిలియన్ల చిన్నారులు ఈ విధంగా బేబీ కేర్ సెంటర్స్‌లో వుంటున్నట్లు తేలింది. వీరిలో దాదాపు 50శాతం మందికి పరిశుభ్రమైన వాతావరణం, ఆహారం, ఆరోగ్యకరమైన పరిసరాలు, తల్లి దండ్రుల వద్ద లభించే ఆప్యాయతానురాగాలు, ఆహ్లాదకరమైన పరిస్థితులు ఇవేమీ లభించక పలు అనారోగ్యాలతో కుమిలిపోతున్నట్టు తేలింది.

-శ్రీకొండ



## యుక్తాముఖి అయిదు జవాబులు



★ మిస్‌వరల్డ్ యుక్తాముఖి చెప్పిన అయిదు జవాబులు చదివితే, ఆ ప్రశ్నలేంటో మీకే అర్ధమవుతాయి.

★ మార్లాలో జరిగిన స్విమ్‌సూట్ ప్రదర్శనలో స్విమ్ సూట్ బికినీతో కనిపించడం ఇబ్బందిగా అనిపించింది.

★ నా చిన్నప్పట్నుంచి నేను అందాలరాణిని అయినట్టు కలకనేదాన్ని. పదమూడు సంవత్సరాల కల.. ఇదిగో ఇప్పుడు నిజమైంది.

★ సినిమాల్లో నటిస్తే ఆ అనుభవం ఎలా వుంటుందో తెలుసుకోవాలని వుంది. బట్ దాన్ని నా కెరీర్‌గా చేసుకోవాలనుకోవడంలేదు.

★ నాకన్నా, ఎత్తు, ఒడ్డూ, పొడవూ ఫ్లస్ నన్ను తప్ప మరెవర్నీ కన్నెత్తి చూడని భర్త కావాలని నాకోరిక.

(అన్నట్టు యుక్తాముఖి ఎత్తు అయిదడుగుల పదకొండు అంగుళాలు)

★ అయిదేళ్ళ వరకు 'నోపెళ్ళి'

- విరాజి

య్యమని.

రఘూ ఆప్యాయంగా చెల్లెలిని చూస్తూ అన్నాడు, ''నువ్వు వచ్చి నెలే కదే అయింది. నాకు నిన్ను మరొక నెల ఇక్కడే ఉంచుకోవాలనుంది.'' అన్నగారి మాటలకి మధు ఏమీ సమాధానం చెప్పలేదు.

''ఇక్కడేదో బండలు మోస్తున్నట్లు మా ఊరు పంపెయ్యి అని అడుగుతున్నావు. అక్కడికి వెళ్ళిమాత్రం ఏం చేయాలి? నాలుగురోజులుండు'' అంది వనజ నిష్ఠూరంగా.

''అమ్మ, నాన్నగారిని చూడాలని ఉంది అన్నయ్యా. నన్ను రేపు పంపెయ్యి'' అంటున్న చెల్లెలిని జాలిగా చూస్తూ అలాగేనన్నట్లు తల ఊపాడు. సాయంత్రం వస్తూ చెల్లెలికి మంచిచీర, జాకట్టుకొని తెచ్చాడు. మాధవి వద్దన్నా అతడు విన్పించుకోలేదు. ఇదివరకు దెబ్బలాడి బట్టలు కొన్పించుకొనేది. ఇప్పుడు ఎవరినీ ఏదీ అడగదు.

ఇల్లు చేరిన మాధవికి లక్ష్మమ్మగారు పూసగ్రుచ్చినట్లు అన్ని విషయాలూ చెప్పేశారు. సుధకి టైఫాయిడ్ జ్వరమని, ఆ పిల్లతో చక్రపాణిగారు యమయాతన పడుతున్నారని ఆవిడ చెప్పగానే మాధవి ఇంక ఒక్క నిముషం ఇంట్లో ఉండలేకపోయింది. ఆ పిల్లకి, మాధవికి మధ్య గల ప్రేమ, సన్నిహితత్వం లక్ష్మమ్మగారికి తెలుసును.

మంచం మీద చిక్కిపోయి పడుకొనున్న సుధని చూస్తే కళ్ళనీళ్ళని ఆపుకోవడం మాధవికి చేతకాలేదు. సుధ మాధవిని చూడగానే ''ఆంటీ'' అంటూ అల్లుకొనిపోయింది. అంతవరకూ మందు త్రాగనని పేచీపెడుతున్న కూతురిని లాలించలేక అవస్థ పడుతున్న చక్రపాణిగారు వాళ్ళిద్దరి సన్నిహితత్వం చూసి తెల్లబోయారు.

సుధని ఒడిలోకి తీసుకొని ముద్దాడుతున్న మాధవి రూపం ఆయనలో ముద్రించుకొనిపోయింది. మాధవి కొంతసేపటికిగానీ ఆయనను గుర్తించలేదు. రాధ, రవిబాబు చెల్లెలు మందు త్రాగడం లేదని పేచీ పెడుతోందని మాధవికి ఫిర్యాదు చేశారు. మాధవి ఆయన చేతిలోని మందు గ్లాసువైపు అప్పుడు చూసింది. ఆయన ఆగ్లాసు ఆమె చేతికిచ్చి అక్కడి నుండి కదిలారు.

''సుధా! నా బంగారుతల్లివి కదూ! మందు త్రాగాలి'' అంటూ మాధవి సుధను బ్రతిమలాడటం, సుధ, ''ఆంటీ! మీరు ఇన్నిరోజులు ఎందుకుండిపోయారు? అందుకే నాకు జ్వరం వచ్చింది'' అనడం ఆయనకి ప్రక్కగదిలోకి వినబడుతోంది. ''ఆంటీ! మీరు ఎప్పుడూ ఎందుకు ఊరెడతారు? వెళ్ళనంటేనే మందు తాగుతా'' అంటున్న సుధని గుండెలకి హత్తుకొంది. రాధ, రవిబాబు మాధవి సుధచేత మందు తాగిస్తుంటే నవ్వుతూ చూశారు.

మాధవి సపర్యల ధర్మమా అని సుధ త్వరగానే కోలుకొంది. మాధవి చక్రపాణి గారింటికి ఎక్కువగా రాకపోకలు చేయడం కామేశ్వరికిష్టంలేదు. మాధవి తల్లి ఇష్టాన్ని లెక్కచేయలేదు. తల్లికోసం తల్లడిల్లుతున్న పిల్లలను సేద తీర్చడం తన ధర్మమనుకొంది. కామేశ్వరమ్మ భర్త దగ్గర మాధవి విషయం, ఆమె ప్రవర్తన ఎత్తి దెప్పలాడసాగింది.

''అమ్మ వద్దన్నపుడు ఆ పిల్లలకు కాస్త దూరంగా ఉండవచ్చుకదమ్మా'' అని అంటున్న తండ్రి మాటలకి మాధవి గాయపడ్డట్లు చూసింది. కూతురు పడుతున్న బాధ ఆమె కళ్ళల్లో చూశాక ఆయనకి మాట సంభాళించుకోవడం కష్టమే అయింది.

కామేశ్వరమ్మ గయ్యిమని లేచింది. ''అలాగ గడ్డిపెట్టండి. అవ్వ, నలుగురూ నవ్విపోతారన్న సిగ్గయినా లేదు. తల్లి, తల్లిమాట దానికి కావాలా?''


మాధవి ఇంక ఓర్చుకోలేకపోయింది. మనవాళ్ళకి సాయం చేయడానికి మిమ్మల్ని విడిచి నేను ఊళ్ళు వెళ్ళినపుడు నీకు పర్వాలేదుకదమ్మా! ఆపదలో, అవసరంలో ఉన్నారని పొరుగువారికి సాయపడటం నీదృష్టిలో మహా నేరమైపోయింది.'' కామేశ్వరమ్మకి కూతురు ఎదురుతిరిగి ప్రశ్నించడం కోపం తెప్పించింది. ఇప్పుడు అదుపులో పెట్టకపోతే కష్టమన్నట్లు ఆమె చిరాగ్గా అనేసింది. వాళ్ళు అవసరంలో ఉన్నారంటే పదిసార్లు ఆ ఇంటి గడప ఎక్కాలా? మనకేమిటి బాధ? అంతగా వాళ్ళ బాధలను చూడలేనంటే ఆయననే కట్టుకొని ఊరేగు. నలుగురిలో నాకు నగుబాటైనా తప్పుతుంది.''

మాధవి తల్లిమాటలకు తెల్లబోయింది. ఆమె మెదడు ఆలోచించే శక్తిని కోల్పోయింది. వెర్రిదానిలాగ చూస్తున్న మనవరాలిని చూస్తే లక్ష్మమ్మగారికి మనసు పిండినట్లయింది.

''కామేశ్వరీ! నువ్వు ఏం మాట్లాడుతున్నావో, ఏం చేస్తున్నావో అర్థమవుతోందా? తల్లివైయుండి బిడ్డను అంతమాట అంటావా? ఆపదలో ఉన్నవాళ్ళకి సహాయపడటం తప్పా? ఏళ్ళు రాగానే సరికాదు, బుద్ధి వికసిస్తేనే సార్థక్యం. అమ్మా! మధూ! నువ్వు లోపలికి వెళ్ళు'' అని లక్ష్మమ్మగారు అన్నప్పటికీ మాధవిలో చైతన్యం కలగలేదు.

కామేశ్వరమ్మకి అత్తగారి ఆగ్రహం ఒక్కక్షణం భయం కలిగించినా, వెంటనే తెప్పరిల్లి ''అందరూ నన్నే అంటారేం? అలాగ తల చెడిన పిల్ల పరుల పంచ పట్టుకొని వ్రేలాడవచ్చునా? అందుకే అన్నదమ్ముల ఇంట ఉండమన్నాను. నాలుగు రోజులుండటానికి ముళ్ళ మీద ఉన్నట్లు బాధపడి వచ్చేస్తుంది. దానికి మీరందరూ వత్తాసు. రేపు నలుగురూ నానారకాలుగా అన్నాక కానీ మీకు అర్థమవదు. అప్పుడు ఏడుద్దురుగాని'' అని అనేసింది. రామారావుగారికి చిరాకు వచ్చేసింది. వెధవ గోల. ఎప్పుడూ తగాదాలే! శాంతిలేదు. ''ఎప్పుడో ఏడవడంకాదే అందరికన్నా ముందు ఇప్పుడే నువ్వు ఏడుస్తున్నావుకదే! వెళ్ళు లోపలికి'' అంటూ కొట్టడానికి చెయ్యి ఎత్తారు.

లక్ష్మమ్మగారికి ఆ పరిస్థితి సిగ్గు కలిగించింది. ఆవిడ మాధవిని తీసుకొని లోపలికి వెళ్ళిపోయారు. పనివాళ్ళు, పొరుగువాళ్ళు వింటారన్న ఇంగితమైనా లేని భార్యను చూస్తే ఆయనకి ఒళ్ళు మండిపోయింది. ఆవిడని కొట్టి



ఇంకా తల్లిదగ్గర పలచన అవడం ఆయనకిష్టంలేదు.

రెండురోజులు గడిచినా మాధవి మనసు తేరుకోలేదు. అందరికీ బరువుగా ఎన్నాళ్ళు బ్రతకాలి? బ్రతుకులో ఒక తీపి లేనప్పుడు ఎలా సాగించడం? తల్లికే తన పరిస్థితి అర్థమవనపుడు లోకానికి అర్థమవుతుందా? ఎవరైనా బ్రతుకులో చేదు కోరుకొంటారు? ఏ జన్మలో ఏం పాపం చేసిందో ఈ మ్రోడు బ్రతుకు ప్రాప్తించింది.

జీవచ్ఛవంలాగ ఏళ్ళు మోసుకొంటూ, ఈ ఎడారి నడక తను సాగించగలదా? ఎంత నిప్పులాగ బ్రతికినా తనని ఈలోకం మెచ్చుకొంటుందా? ఇంటివాళ్ళకే తన ప్రవర్తన నచ్చనప్పుడు బయటివాళ్ళకి ఎలాగ నచ్చుతుంది? ఈరోజు తల్లి, రేపు వదిన, ఎల్లుండి మరొకరు, ఇలాగ అందరినీ అనమంటూ జీవితం గడపాలా? అసలు జీవితానికి అర్థం ఏమిటి? తనకి తోచిన సహాయం పదిమందికి చేయడం ఎలా తప్పవుతుంది? మనం బ్రతుకుతూ మరొకరికి సహాయమందించడం మన కర్తవ్యం కాదా? విధి చిన్నచూపు చూసిందని బ్రతుకు పరిధిని తగ్గించుకోవాలా? ఒక వ్యక్తి అందరినీ మెప్పించగలదా?

ఆమెలో జవాబులేని ప్రశ్నలు ఎన్నో. బ్రతుకు దుర్భరంగా, అశాంతిగా బాధపెడుతోంది. లక్ష్మమ్మగారికి మనవరాలి మౌనం ఎంతో బాధ పెడుతోంది.

పిల్లలు పడుకొన్నాక, ఇంటి తలుపులు వేయడానికి వచ్చిన చక్రపాణిగారు, వరండాలోని క్రీనీడలో ఎవరో వ్యక్తి ఉండటం చూసి ''ఎవరదీ?'' అంటూ బయటికి వచ్చారు. ఎవ్వరైందీ ఆయనకి అర్థమవలేదు. ''ఎవరంటే మాట్లాడరేం?'' అంటూ అటువైపు రెండడుగులు వేశారు. ''నేను.. నేను లోపలికి రావచ్చునా?''

ఆయన మాధవి ప్రశ్నకి తెల్లబోయినట్లు చూశారు. ఆ సమయంలో ఆమె రావడమే ఆశ్చర్యం అనుకుంటే లోపలికి వస్తాననడం ఇంకా ఆశ్చర్యం కలిగించింది.

మాధవి బిడియంతో, నెమ్మదిగా ''మీతో మాట్లాడవలసిన అవసరం కలిగింది. లోపలికి రావచ్చునా?'' అంది. ఆయన తల ఊపడంతో లోపలికి వచ్చింది. ఆయన నెమ్మదిగా ఆమె ననుసరించారు. ఎప్పుడూ పన్నెత్తి మాట్లాడని మాధవి, కళ్ళెత్తి ఏనాడూ చూడని మాధవి అలాగ రావడం ఆయనకి ప్రశ్నార్థకమైంది.

భుజాలచుట్టూ పమిట కప్పుకొని, అరచేతిలోని గీతలను చూస్తూ మాధవి నిలబడటం చూసి ఆయనే అన్నారు.

''మీరు కూర్చోండి. నిర్భయంగా మీరు ఎందుకు వచ్చారో చెప్పండి.''

మాధవికి తన మనసులోని మాట ఆయనకి చెప్పడం అంత తేలికైన విషయంగా అన్పించలేదు. ఎలా చెప్పాలో, ఏమని చెప్పాలో కంగారులో అసలు తోచడం లేదు. నుదిటినిండా స్వేదబిందువులు మనసులోని కంగారుని, భయాన్ని ఆమె చెప్పకుండానే ఆయనకి తెలియజెప్పాయి.

ఆయన వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిచ్చారు. మాధవి మారు మాట్లాడకుండా గ్లాసు తీసుకొని త్రాగేసింది. ఆమెకి కొంత నిబ్బరం వచ్చింది. ఏది ఏమైనా, ఫలితం ఎలాగున్నా తన మనసులోని విషయం చెప్పాలి. నిర్ణయం ఆయనదే. అలాగ ఆలోచించుకొన్నాక కొంత ధైర్యం వచ్చింది.

ఆయన మాధవి మాటలు విననడానికన్నట్లుగా చూస్తూ, అంతలో దృష్టి ప్రక్కగదిలో పడుకొని నిద్రిస్తున్న పిల్లలవైపు తిప్పారు. మాధవి తల ఎత్తి చూసింది. ఆయన చూపులననుసరించిన ఆమె కళ్ళు పిల్లలవైపు తిరిగాయి. ఆమెకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

''చూడండి. నా జీవితం ఏమిటో మీకు తెలిసే ఉంటుంది. ఏమనిషి బ్రతుకుకైనా ఒక అర్థం, పరమార్థం ఉండాలి. భార్యపోయినా ఈ సమాజంలో నిర్భయంగా, నిశ్చింతగా మీరు బ్రతకగలరు.

కానీ నాలాంటి ఆడవాళ్ళ బ్రతుకు అలాగకాదు. సూదుల్లాంటి చూపులతో అందరూ వెంటాడుతూనే ఉంటారు. మిమ్మల్ని రెండవ పెళ్ళి చేసుకోమని ఎందరో ఒత్తిడి చేస్తున్నారు. మీరు వద్దని తిరస్కరించారు. మీ భార్యపై మీకుగల ప్రేమ నన్ను మరింత ముగ్ధురాలిని చేసింది. నా జీవితం గురించి విశాల హృదయంతో ఆలోచించమని అర్థించడానికి వచ్చాను.

మాధవి నిద్రిస్తున్న పిల్లలవైపు వేలుపెట్టి చూపిస్తూ అంది, ''ఇలాగ మిమ్మల్ని అడిగే హక్కు నాకు ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోతున్నారా? మీ బిడ్డలే ఇచ్చారు. వాళ్ళకి నేను అండగా ఉంటాను. వాళ్ళ పెంపకంలో మీకు సహకరిస్తాను. నా జీవితానికి మీరు ఆసరా కాగలరా? ఆ బిడ్డలతోపాటు నాకూ జీవితాన్ని ప్రసాదించగలరా?''

చక్రపాణిగారు మాధవి మాటలకి అదిరిపడ్డారు. ఆయన మౌనం ఆమెని కంగారుపెట్టింది.

ఆయన కొద్దిసేపైన తరువాత నెమ్మదిగా అన్నారు, ''మాధవీ! మీరు ఆవేశంలో ఉన్నారు. మిమ్మల్ని వివాహం చేసుకొంటే నేను ఏవిధంగానూ న్యాయం చేయలేను. జీవితంలో ఆపిల్లల పెంపకం తప్ప నాకు వేరే ధ్యాసలేదు. మీరు కోరుకుంటే తప్పక మంచి జీవితం మీకు లభిస్తుంది. ముగ్గురు బిడ్డలతో, నాతో జీవితం మీకు అసంతృప్తినే మిగులుస్తుంది.

ఆయన మాటలకి ఆమె చిన్నగా నిట్టూర్పు విడిచింది.

''మీరు అదృష్టవంతులు. ముత్యాల్లాంటి ముగ్గురు బిడ్డలున్నారు. నాకూ ఆ అదృష్టం కలిగించమంటున్నాను. ఈ నిర్ణయం నేను ఆవేశంతో తీసుకోలేదు. ఆలోచనతోనే చేసుకొన్నాను. ఎన్నో కోరికలు నేను మనసులో పెట్టుకొంటే కదా న్యాయాన్యాయాల ప్రసక్తి. నేను వాస్తవాన్ని చూస్తున్నాను.

నాకు జీవితంలో ఒక నిశ్చింత, శాంతికావాలి. ఒక ధ్యేయంవైపు నా ప్రయాణం సాగాలి. మీ నీడలో, ఈ బిడ్డల పెంపకంలో నా జీవితం సాగాలి. మా వాళ్ళు నా నిర్ణయాన్ని అర్థంచేసుకోకపోవచ్చును. మీరు బాగా ఆలోచించుకొని నాకు తెలియజేయండి. ఇద్దరం ఒకరికి మరొకరు తోడగా బ్రతుకుబాటలో పయనిద్దాం. నా నిర్ణయం సరైనదే అనుకొంటే, మీ అభిప్రాయం తెలియజేస్తారు.''

మాధవి చెప్పవలసింది చెప్పేశానన్న నిశ్చింతతో వెళ్ళిపోతూంటే ఆయన చూస్తూ నిలబడ్డారు. ఆ రాత్రి అంతా ఆయన గదిలో లైటు వెలుగుతూనే ఉంది.

మర్నాడంతా మాధవి అన్యమనస్కంగానే గడిపింది. ఆయన తన గురించి ఏమనుకొంటున్నారో అన్న కంగారు, తన కోరికలోని నిజాయితీని గుర్తించారో లేదో అన్న శంక ఆమెను నిలవనీయడంలేదు.

''మధూ! ఎవరో తలుపు కొడుతున్నారు. చూడమ్మా'' అన్న తండ్రి మాటలకి మాధవి వెళ్ళి తలుపు తీసింది. తలుపు తెరిచిన మాధవిని చిరునవ్వుతో చూస్తూ, చక్రపాణిగారు, ''నేను నా వివాహ విషయం మీ నాన్నగారితో మాట్లాడాలని వచ్చాను. లోపలికి రావచ్చునా?'' అని అడిగారు.

మాధవి సిగ్గుతో తలవంచుకొని, ప్రక్కకి తొలగి, ఆయనకి దారి ఇచ్చింది.

★

## బెడ్‌రూంలోకి



''మీకు రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టాలంటే మీ ట్రబుల్స్‌ని, ప్రాబ్లెమ్స్‌ని బెడ్‌రూమ్‌లోకి రానీయకండి. బయటనే వుంచండి'' సలహా ఇచ్చాడు డాక్టరు మిత్రుడు శరత్‌కి.

''అదెలా వీలవుతుంది. నా భార్యని బెడ్‌రూమ్‌లోకి రావద్దంటే అది వూరుకుంటుందా?'' అమాయకంగా ప్రశ్నించాడు శరత్.

## ఎవరికి బాధ?

''బాధ తగ్గించే మంచి మందివ్వండి'' అడిగాడు నాని మందుల షాపు అతన్ని.

పెయిన్ రిలీవింగు టాబ్లెట్లు ఇచ్చి ''బాధ ఎవరికి బాబూ?'' అని అడిగాడు షాపువాడు.

''మా నాన్నగార్కి.. నా ప్రోగ్రెస్ కార్డు చూపించి సంతకం చేయించుకోవాలి ఆయనచేత.''

## మహానుభావుడు

''ఆ ఫోటో దగ్గర కూర్చుని అంతలా ఏడుస్తావెందుకు.''

''ఆ మహానుభావుడు పోయినందుకే నాకీ కష్టాలు. ఆయన జీవించి వుంటే నాకీ అవస్థలుండకపోను.''

''ఆయన నీకు అంత దగ్గర బంధువా?''

''ఆహా! బంధువు కాదు. అతను మా ఆవిడ మొదటి భర్త!''

## ఏడుస్తారా?

''ఏమండీ, నేను చచ్చిపోతే మీరు ఏడుస్తారాండీ?'' గారాలు పోతూ అడిగింది భార్య.

''అప్పటిదాకా ఎందుకు? ఇప్పుడు నేను చేస్తున్నది అదేకదా!'' చికాకు పడ్తూ చెప్పాడు భర్త.

- పి.సరోజ (అమలాపురం)